క్లుప్తంగా

మల్కాపురం శివారు చేలకు సాగునీరు



మల్కాపురం శివారు భూముల్లో నీటిని పరిశీలిస్తున్న జీవనసంధ్య

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం మల్కాపురంలో పంట చేలకు సాగునీరు చేరిందని మండల వ్యవసాయ అధికారిణి ఎ.జీవనసంధ్య అన్నారు. శుక్రవారం ఆమె మల్కాపురం శివారు ప్రాంతాల్లో పంట కాలువలో సాగునీరు పారుదలను, చేలల్లోకి దిగి వరిదుబ్బులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం జిల్లా వ్యవసాయశాఖ సంచాలకులు రామకృష్ణ మల్కాపురం వచ్చి పంట చేలను పరిశీలించారని తెలిపారు. సాగునీరు విడుదలపై రైతులు అభిప్రాయాలను తెలుసుకుని కృష్ణా కెనాల్ నుంచి నీటి విడుదలకు కృషి చేశారన్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సైతం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం వల్ల ఇరిగేషన్ అధికారులు రెండురోజుల క్రితం సాగునీరు విడుదల చేశారని చెప్పారు. గ్రామంలో శివారు భూములకు సైతం నీరు అందడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 42వ డివిజన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారి సప్తమ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు కోట సత్య ప్రకాశాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ఉదయం 11 గంటలకు స్వామి శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు స్వామి వారి నగరోత్సవం, రాత్రి 7 గంటల నుంచి స్వామి వారి పవళింపు సేవ ఉంటుందని వివరించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

'యర్రా' సేవలు మరువలేం

ఏలూరు రూరల్: మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి పోణంగి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఏలూరు మార్కెట్‌యార్డ్ వైస్‌చైర్మన్, మాజీ సర్పంచ్ కంచన రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, మంత్రిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పోణంగిలో ఓవర్‌హెడ్ ట్యాంక్, పైప్‌లైన్, పశువుల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు విడుదల చేయించారని గుర్తు చేశారు.

ఏలూరులో 'మా నమ్మకం నువ్వే జగన్'

- ఇంటింటికి వెళ్లిన కన్వీనర్లు, గృహసారథులు
- రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి



7వ డివిజన్‌లో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, కార్పొరేటర్ శ్రీదేవి, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి సదానందం



గవరపేటలో ఇంటికి స్టిక్కర్ అంటించి మహిళలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ కన్వీనర్ నాయిడు, గృహసారథులు

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేస్తూ విశ్వసనీయతకు నిదర్శనంగా నిలిచారని రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ల జోన్–1 ఇన్‌చార్జి మోటమర్రి సదానందం, గృహసారథులు, కన్వీనర్లతో ఇంటింటికి వెళ్లి శుక్రవారం సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలు ఏ మేరకు అందుతున్నాయనే విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. గృహ యజమానుల అనుమతితో ఇంటికి సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్, పలువురు మహిళల సెల్ ఫోన్లపై స్టిక్కర్లను అతికించారు. సంక్షేమ పథకాలు గతం ప్రభుత్వాల హయాంలో ఏమైన అందాయా.. ఇప్పుడు సీఎం జగనన్న ప్రభుత్వంలో ఏ విధంగా అందుతున్నాయి.. పథకాల పంపిణీ తీరుపై సంతృప్తికరంగా ఉందా అని ఆరా తీశారు.

మెరుగైన సేవలకు కృషి

ఈ సందర్భంగా పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పేదవర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందించడంతో పాటు స్థానిక సమస్యలను సైతం పరిష్కరించేందుకు తాజాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమించారని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ అనుసంధానంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

పథకాలపై ఆరా

నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆధ్వర్యంలో 50వ డివిజన్‌లో సచివాలయ కన్వీనర్ నాయుడు, గృహసారథులు స్థానిక గవరపేటలో ఇంటింటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటిలోనూ మహిళలను సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ వారి అభిప్రాయాలను అడిగి తీసుకున్నారు. మొబైల్ ఫోన్లకు, ఇంటి గోడలు, డోర్లకు సీఎం జగనన్న చిత్ర పటంతో కూడిన స్టిక్కర్‌ను అతికించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి పంపిన కరపత్రాన్ని చదివి వినిపించారు.

సీఎం జగన్ వెంటే జనం

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన మెచ్చి జనం జేజేలు పలుకుతున్నారని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఏలూరు మండలం మొండికోడు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏ ఇంటికెళ్లినా, ఏ మహిళను పలకరించిన జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నామని చెబుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాలకు మహిళలు జేజేలు పలుకుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాల్లో సైతం ప్రతి వాడ, ప్రతి ఇంటికీ పథకాల చేరాయని తెలిపారు. మహిళలు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిపి గెలిపిస్తారని ఆకాంక్షించారు. తొలుత ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కొండలరావు, ముంగర సంజీవ్‌కుమార్, బాపనయ్య, గృహసారథుల కన్వీనర్ గుర్రం శివ, మొండికోడు సర్పంచ్ వేజెళ్ల గోపాలకృష్ణరాజు, బోడిగడ్డ శ్రీను, వర్రీ నారాయణ, శ్యామ్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



మొండికోడులో సంక్షేమ పథకాల కరపత్రం అందుకుంటున్న మహిళ

త్యాగానికి ప్రతీక
గుడ్ ఫ్రైడే

ఏలూరు నగరంలో శిలువ ర్యాలీలు



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో శిలువ మోస్తున్న ఫాస్టర్లు



అశోక్‌నగర్ అమలోద్భవి విచారణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విచారణ గురువు ఫాదర్ ఇంజే పాల్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): త్యాగానికి ప్రతీకగా గుడ్ ఫ్రైడేని నిర్వహిస్తామని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు తెలిపారు. నగరంలో గుడ్ ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని ప్రధాన చర్చిలతో పాటు వివిధ ప్రాంతాల్లోని క్రైస్తవ ఆలయాల్లో సైతం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు శిలువలు మోస్తూ ర్యాలీలు నిర్వహించారు. క్రైస్తవ గీతాలాపన చేశారు. స్థానిక అమలోద్భవి కేథీడ్రల్‌లో ఉదయం శిలువ మార్గం, అనంతరం కృపార్చన ప్రార్థన చేశారు. సాయంత్రం సెయింట్ థెరిస్సా హైస్కూల్ నుంచి కేథడ్రల్ ఆలయం వరకు శిలువ మార్గం నిర్వహించి అనంతరం కేథడ్రల్ ఆవరణలో శిలువ ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసు బోధనలను అనుసరించి శాంతి స్థాపన కోసం కృషి చేయాలని కోరారు. పేదలకు సాయం చేయడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపాలని, వారికి సమాజం అండగా ఉంటుందనే విశ్వాసం కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ మైఖేల్ ఇంజమాల పాల్గొన్నారు. అశోక్ నగర్‌లోని అమలోద్భవి విచారణలో నిర్వహించిన కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ ఇంజే పాల్ పాల్గొని శాంతి సందేశం ఇచ్చారు. నగరంలోని ఐసీఎం, ఆర్‌సీఎం, సీఎస్ఐ, సాల్వేషన్ ఆర్మీ, సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమీనాపేట, వంగాయగూడెం, శాంతి నగర్, సత్రంపాడు, ఇజ్రాయేలు పేట, ఫిల్‌హౌస్ పేట, అరుంధతీ పేట, గొల్లాయగూడెం, వైఎస్సార్ కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన శిలువ ర్యాలీల్లో క్రైస్తవ గురువులు, పాస్టర్లు, యవ్వనస్తులు, మత కన్యలు, విశ్వాసులు సిలువలు, కొవ్వొత్తులతో పాల్గొన్నారు.



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు ,



జాలిపూడిలో శిలువు మార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు

జాలిపూడిలో శిలువ మార్గం

ఏలూరు రూరల్: గుడ్‌ఫ్రైడే సందర్భంగా జాలిపూడిలో క్రైస్తవులు శిలువ మార్గం నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ తోట ఆంథోనీరాజు ఆధ్వర్యంలో చర్చిలో ప్రార్థనలు చేశారు. తొలుత పలువురు ఏసు క్రీస్తు ఆరాధకులు శిలువపై ప్రభు చిత్రపటాన్ని అమర్చి గ్రామ వీధుల్లో పయనించారు. భుజంపై శిలువును మోస్తూ ఏసుప్రభును ఆరాధించారు. స్త్రీలు పెద్ద సంఖ్యలో ప్రభును స్తుతించారు.

దంత సమస్యలపై అవగాహన

పెదవేగి : దంత సమస్యలపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అవగాహన కలిగి ఉండాలని ప్రజా దంత వైద్య విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ పావన సంధ్య, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణిమ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల్లో ప్రజా దంత ఆరోగ్య వైద్య విభాగం ఆధ్వర్యంలో పెదవేగి పీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఏఎన్ఎంలకు, ఆశావర్కర్లకు నోటి పరిశుభ్రత ఆవశ్యకత, దంత సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల యాజమాన్యం, సెక్రటరీ, కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ స్లీవరాజు సహకరించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు టి ప్రశాంత్, స్టాఫ్, ప్రజాదంత వైద్య విభాగ హౌస్ సర్జన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో బోరు నిర్మాణం

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మపేరంటాలమ్మ ఆలయానికి, భక్తుల సౌకర్యార్థం అడిగిన వెంటనే ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడంపై కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అమ్మవారి ఆలయ ఆవరణలో బోరు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	68
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	08-10
బెండకాయలు	20	కంద	46
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-34	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	54	అల్లం	120
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	60
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

సబ్‌ప్లాన్ గడువు పొడిగింపుతో దళితులకు న్యాయం

ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో హర్షాతిరేకాలు



సబ్‌ప్లాన్ గడువు పొడిగించాలని, దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలంటూ సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కాల పరిమితిని మరో 10 సంవత్సరాలు పొడిగిస్తూ ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో తీర్మానించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మరోసారి పేదల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుజువు చేసుకున్నారంటూ దళిత, ఆదివాసీ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉపాధి పరంగా ముందడుగు వేయడానికి ఊతమిచ్చే విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి 2013లో సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చారు. దీని కాలపరిమితి 2023 జనవరి 24తో ముగియనుండటంతో దీన్ని శాశ్వతంగా అమలు చేయాలని కోరుతూ దళిత, గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగులు, మేధావులు ప్రభుత్వానికి లేఖలు రాశారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు, సమావేశాల ద్వారా విజ్ఞప్తులు చేశారు. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గడువుకు రెండు రోజులు ముందుగానే ఈ ఏడాది జనవరి 22న ఆర్డినెన్స్ ద్వారా జీఓ నెంబర్ 7ను విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశంలో సబ్‌ప్లాన్ పొడిగింపు ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే విధంగా తీర్మానించారు. దీంతో సబ్ ప్లాన్ చట్టం కాలపరిమితి 2033 జనవరి 24 వరకు అమలులో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా వర్గాల్లో సంతోషాలు వ్యక్తం చేయడంతోపాటు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సీఎం జగన్‌కు అభినందనలు



ఎస్సీ, ఎస్టీల మనసెరిగి సబ్ ప్లాన్ చట్టం గడువు మరో పదేళ్లు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అభినందనలు. జనాభా ప్రాతిపదికన రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన నిధులను ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమానికే వినియోగించాలి. సబ్ ప్లాన్ చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి. దీని అమల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ఐపవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలి



సబ్ ప్లాన్ చట్టం అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం నెరవేరేవిధంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలి. అప్పుడే సబ్ ప్లాన్ చట్టం అసలు లక్ష్యం నెరవేరుతుంది. జిల్లా స్థాయిలో కమిటీలు వేసి ప్రతి మూడు నెలలకు ఒకసారైనా దీని అమలు విధానలపై పరిశీలన చేయాలి.

– కొరబండి బాబూరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, దళిత మహాసభ

శాశ్వతంగా అమలు చేయాలి



సబ్ ప్లాన్ చట్టాన్ని పదేళ్ల పొడిగించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. దీన్ని శాశ్వతంగా అమలు చేయాలని, లేదంటే గడువును మళ్లీ పొడిగించాలని కోరుతూ దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ పక్షాన జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహించాం. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులకు వినతులు అందజేశారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. – వరపు జ్యోతి, జిల్లా కన్వీనర్, దళిత, గిరిజన బడ్జెట్ వాచ్

పేదల పెన్నిధి వైఎస్ జగన్



ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం నిర్దేశించిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం గడువును మరో పదేళ్ల పొడిగించడం ద్వారా సీఎం జగన్ తన ఔన్నిత్యాన్ని చాటుకున్నారు. సీఎం జగన్‌ను కలిసి దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని, సబ్‌ప్లాన్ చట్టాన్ని పొడిగించాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చాం. దీనిపై సీఎం స్పందించడం అభినందనీయం.

– పెరికె వరప్రసాదరావు, జాతీయ అధ్యక్షులు, ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్

నూకాలమ్మకు సువర్ణ కంఠాభరణం సమర్పణ



దాతలను అమ్మవారి చిత్రపటంతో సత్కరిస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్ రాజాన పండు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ వారికి సువర్ణ కంఠాభరణాన్ని దాత నడిపల్లి సత్యనారాయణ, పద్మావతి దంపతులు అందజేశారు. ప్రధాన అర్చకులు మనోజ్‌శర్మ ఆలయ కల్యాణ కళావేదికవద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం, మూల విరాట్‌కు విశేష పూజలు చేశారు. స్థానిక నడిపల్లి సత్యనారాయణ, పద్మావతి దంపతులు ఉత్సవమూర్తికి రూ. 51,116 విలువ గల సువర్ణ కంఠాభరణం సమర్పించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో అమ్మవారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని ఇచ్చి వేద ఆశీర్వాదంతో ఘనంగా సత్కరించారు. కనుపర్తి రామకృష్ణ, గొట్టుముక్కల వంశీకుమార్‌రాజు, తిప్పభట్ల రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి, అనంతేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు, ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో దువ్వ రామకృష్ణ దంపతులు, చోడవరం జ్యోతి దంపతులు, నాగరాజు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఐటీడీఏకు రెగ్యులర్ పీఓను నియమించాలి

ఏలూరు (టూటౌన్): కేఆర్‌పురం ఐటీడీఏలో రెగ్యులర్ పీఓగా ఐఏఎస్ అధికారిని నియమించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. కేఆర్‌పురం ఐటీడీఏలో పీఓ పూర్తి స్థాయి బాధ్యతలు నిర్వహించే విధంగా, ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరుతూ ఇప్పటికే అనేక సార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. గిరిజనులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఐటీడీఏకు వస్తే అధికారులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత కొద్దికాలంగా ఇన్‌చార్జి పీఓలను నియమించి వారిని కొద్ది కాలం వ్యవధిలోనే బదిలీ చేయడం బాధాకరమని తెలిపారు. రెగ్యులర్ పీఓ లేకపోవడం వల్ల ప్రతి బుధవారం నిర్వహించే ప్రజా దర్బార్ ద్వారా ప్రజా సమస్యలు వినే నాథుడు లేక గిరిజనులు అన్యాయానికి గురవుతున్నారని వివరించారు.